manachourasta

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా
Telugu News
Channel

సంపుటి : 01 | సంచిక : 223 | బుధవారం | 12.02.2025

## మినీ మేడారానికి వేళాయే..!

- నేటి నుంచి సమ్మక్క - సారక్క జాతర
- అన్నీ ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- వరంగల్, హనుమకొండ నుంచి ప్రత్యేక బస్సుల సర్వీలు

**ములుగు జిల్లాలో** జరిగే సమ్మక్క-సారలమ్మ మినీ మేడారం జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం నుంచి మినీ మేడారం జాతర ప్రారంభం కానుండడంతో అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేశారు. ఈ జాతరకు దాదాపు 10 లక్షల మందికి పైగా భక్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ మేరకు భక్తుల సౌకర్యార్థం మేడారం వరకు ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఆర్టీసీ సిద్ధమైంది. ప్రధానంగా వరంగల్ నగరంలోని హనుమకొండ, వరంగల్ బస్టాండ్ నుంచే ఎక్కువ మంది భక్తులు ఆర్టీసీ సేవలు వినియోగించుకునే అవకాశం ఉండగా వరంగల్ 1, వరంగల్–2 డిపోలతో పాటు హనుమకొండ డిపోలకు చెందిన బస్సులతో మేడారం స్పెషల్ ట్రిప్స్ నడిపేందుకు ఏర్పాట్లు చేశారు. మేడారం మినీ జాతర కోసం హనుమకొండ, వరంగల్ -1, వరంగల్- 2 డిపోల నుంచి దాదాపు 200 బస్సులు నడిపించనున్నట్లు ఆర్టసీ అధికారులు తెలిపారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఇతర డిపోల నుంచి ప్రత్యేక సర్వీసులు నడిపేందుకు రెడీగా ఉన్నట్లు చెప్పారు.

- మన చౌరాస్తా, ములుగు





### క్రీడలతో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది

3

- జనగామ డీసీసీ ప్రెసిడెంట్ కొమ్మూరి



### జనగామలో నవోదయ ఏర్పాటు చేయాలి

4

- వరంగల్ ఎంపీ కడియం కావ్య



### స్థానిక సంస్థల ఎన్నికలే టార్గెట్

3

- గ్రామాల్లో బీఆర్ఎస్ మీటింగ్‌లు




## కష్టపడి కాదు.. ఇష్టపడి చదవాలి

- ఉత్తమ ఫలితాల కోసం నిరంతరం తపించాలి
- క్రమశిక్షణ, పట్టుదలే విజయసోపానాలు
- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

2 లో



# కష్టపడి కాదు.. ఇష్టపడి చదవాలి

- ఉత్తమ ఫలితాల కోసం నిరంతరం తపించాలి
- క్రమశిక్షణ, పట్టుదలే విజయసోపానాలు
- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**జనగామ (నర్మెట), మన చౌరాస్తా :** విద్యార్థులు కష్టపడి కాకుండా.. చదువును ఇష్టపడి చదవాలని, అప్పుడే మంచి ఫలితాలు సాధిస్తారని జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం నర్మెట్ట మండల కేంద్రంలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రేరణ కార్యక్రమానికి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో పాటు ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 300 మంది విద్యార్థులు విద్యార్థులు హాజరయ్యారు. విద్య శాఖ వివిధ సబ్జెక్టు నిపుణులైన ఉపాధ్యాయులతో పాటు ఆయా సబ్జెక్టు లలో నిష్ణాతులైన శిక్షకులు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 7 సబ్జెక్టులపై విద్యార్థులలో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా డీఓవో రమేశ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుపై ఇష్టం పెంచుకోవాలని, అత్యుత్తమ మార్కులను సాధించి జిల్లాను రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. పరీక్షలు సమీపిస్తున్నందున సమయాన్ని ఏమాత్రం వృథా చేయరాదన్నారు. ప్రతి విద్యార్థి ప్రణాళికతో చదువుకోవాలన్నారు. ప్రధానంగా 5 అంశాలపై దృష్టి పెట్టాలన్నారు.



సమయానికి భోజనం చేయాలని, ఆరోగ్యంగా ఉంటేనే విద్యపై ఆసక్తి కలుగుతుందన్నారు. తమ పిల్లల భవిష్యత్ ను ఉజ్వలంగా తీర్చిదిద్దుకునేందుకు దాతలు ముందుకు రావడం హర్షణీయమన్నారు. విద్యార్థుల మధ్య ఈ ఒరియంటేషన్ కార్యక్రమాలు ఐక్యతను పెంపొందిస్తాయన్నారు. విద్యలో చర్చ ద్వారా విజ్ఞానం బలీయంగా నాటుకుంటుందని చెప్పారు. అనంతరం దాతలు సమకూర్చిన పరీక్ష ప్యాడ్, స్కేల్, కంపాక్స్, పెన్ తదితర పరీక్ష సామగ్రితో కూడిన కిట్ ను విద్యార్థులకు కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో ఏఎంఓ శ్రీనివాస్, ఎంఈఓ మడుపల్లి ఐలయ్య, ప్రధానోపాధ్యాయులు వేణు, గోపాల్ రెడ్డి, కమల, తహసీల్దార్ ఆంజనేయచారి, సబ్జెక్టు నిపుణులు, రిసోర్స్ పర్సన్స్, విద్యార్థులు పాల్గొన్నారు.




## టీఎస్‌జేయూ మండల అధ్యక్షుడిగా విక్రమ్

**కేసముద్రం, మన చౌరాస్తా :** తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ (ఎన్‌యూజే-ఐ) కేసముద్రం మండల కమిటీని మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు చిర్రగోని ఉదయ్ ధీర్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఉప్పరపల్లి గ్రామానికి చెందిన మంద విక్రమ్, ప్రధాన కార్యదర్శిగా అర్పణపల్లి గ్రామానికి చెందిన గంధసిరి యాకయ్య, కోశాధికారిగా నారాయణపురం గ్రామానికి చెందిన తాడూరి ఉమా మహేష్‌ను ఎన్నుకున్నారు. అలాగే ఉపాధ్యక్షులుగా సోమారపు శ్రీరాములు, కందుకూరి రాజేంద్ర చారి, కార్యవర్గ సభ్యులుగా చల్లమల్ల కిరణ్, మిట్ట గడుపుల మహేందర్, జన్ను శ్రీను, కాసు సతీష్, బోడ ప్రశాంత్, గంధం భరత్, జగన్ తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల నూతన అధ్యక్షులు మంద విక్రమ్ మాట్లాడుతూ జర్నలిజం వృత్తిలో కొనసాగుతూ నిరంతరం ప్రజా సమస్యలను వెలికితీస్తూ, ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉంటున్న వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. తనకు మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన జిల్లా బాధ్యులు, సంఘం సభ్యులకు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలి

**సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి**

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ పట్టణంలో హైదరాబాద్ రోడ్డులోని ఎన్‌హెచ్ 163 రోడ్డును ఆనుకొని పసరమడ్ల స్టేజి వరకు నిర్మాణం చేస్తున్న బైపాస్ రోడ్డులో ప్లాట్లను కోల్పోతున్న బాధిత ప్లాటు యజమానులకు నష్టపరిహారం చెల్లించినాకనే పనులు చేపట్టాలని సీపీఎం జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం జనగామ జిల్లా కార్యాలయంలో బైపాస్ లో ప్లాట్లు కోల్పోతున్న ప్లాట్ యజమానులతో బూడిద గోపి, వేమునూరి రాజేంద్రప్రసాద్ నేతృత్వంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కనాకారెడ్డి మాట్లాడుతూ రైతులు, కార్మికులు, చిన్న వ్యాపారులు, మధ్యతరగతి ఉద్యోగులు రూపాయి రూపాయి కూడా పెట్టుకుని పిల్లల భవిష్యత్తు కోసం జనగామ పట్టణంలోని శివారు ప్రాంతాలలో ప్లాట్లు కొనుక్కున్నారని అన్నారు. వారి ప్లాట్లల్లో అభివృద్ధి పేరుతో ప్రభుత్వం నిర్మాణం చేస్తున్న బైపాస్ రోడ్డు వల్ల వందలాది మంది ప్రజల ఇళ్ల స్థలాలు కోల్పోతున్నారని తెలిపారు. వారికి నష్టపరిహారం అందించిన తరువాతనే రోడ్డు పనులు చేపట్టాలని కోకారు. లేకుంటే బాధితుల పక్షాన సీపీఎం సమరశీల పోరాటాలకు సిద్ధమవుతుందని తెలిపారు.






### కేసీఆర్‌ను కలిసిన ముత్తిరెడ్డి

**జనగామ మాజీ శాసన సభ్యులు ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి జన్మదినం సందర్భంగా తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముత్తిరెడ్డిని కేసీఆర్ శాలువాతో సత్కరించి ఆశీర్వదించారు.**

*- జనగామ, మన చౌరాస్తా*



## పన్నుల వసూళ్లు సకాలంలో పూర్తి చేయాలి

**మున్సిపల్ అధికారులను ఆదేశించిన కలెక్టర్**

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ, మన చౌరాస్తా : మున్సిపాలిటీ కార్యాలయంలోని సమావేశమందిరంలో మున్సిపల్ కమీషనర్ ఆధ్వర్యంలో మున్సిపల్ ప్రత్యేక అధికారి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ తో కలిసి కలెక్టర్ రిజ్వాన్ బాషా సమీక్ష నిర్వహించారు. ప్రధాన అజెండా అంశాలైన మున్సిపల్ టాక్స్ వసూళ్లు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల వివరాల సేకరణ, ఎల్.ఆర్.ఎస్., భవన నిర్మాణ అనుమతులు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటి పన్నులు, నల్లా పన్నులు వసూళ్లు 100 శాతం చేయాలన్నారు. చెత్త తరలింపు, ప్లాంటేషన్ నిర్వహణ , పట్టణ ప్రకృతి వనాల నిర్వహణ నిరంతరం జరగాలన్నారు. రోడ్లపై చెత్త వేస్తూ ప్రజలను ఇబ్బంది పెడుతున్న వారిని నిర్లక్షం ప్రదర్శిస్తున్న వారిని గుర్తించి జరిమానా విధించాలన్నారు. పట్టణ ప్రకృతి వనాలు, అవన్యూ ప్లాంటేషన్ తదితర మున్సిపాలిటీ లో నాటిన మొక్కలకు నీరు పోయాలని, వేసవి కాలంలో ఒక్క మొక్క కూడా ఎండిపోకూడదన్నారు. రోడ్లపై, నెల్లుట్ల చెరువు వద్ద, హైవే ప్రక్కన చెత్త వేసిన వారికి 25 వేల వరకు జరిమానా విధించాలన్నారు. వృథా వ్యర్థాల తరలింపుపై అడిగి తెలుసుకున్నారు. వార్డ్ అధికారులకు గుర్తింపు కార్డులు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఏప్రిల్ 1న రూ.6.50 కోట్లలో 5 కోట్లు వసూళ్లు చేసిన వారిలో 5 గురికి బెస్ట్ ఆఫీసర్ గా అవార్డ్ తో పాటు క్యాష్ ప్రైజ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. సమీక్ష సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, మేనేజర్ రాములు, వార్డ్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



Local News



# క్రీడలతో ఆత్మవిశ్వాసం

- డీసీసీ ప్రెసిడెంట్ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి

**జనగామ, మన చౌరాస్తా :** క్రీడలతో మానసికోల్లాసంతో పాటు ఆత్మవిశ్వాసం పెరుగుతుందని జనగామ డీసీసీ ప్రెసిడెంట్ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో ప్రెస్టెన్ గ్రౌండ్‌లో జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి వరంగల్ జిల్లా క్రికెట్ పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కొమ్మూరి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడాకారులను ఎప్పటికప్పుడు ప్రోత్సహిస్తుందన్నారు. క్రీడల వల్ల మానసిక ఒత్తిడి తగ్గుతుందని, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని, ఊబకాయం వచ్చే ప్రమాదాన్ని తగ్గిస్తుందని అన్నారు. క్రీడలు సంపూర్ణ ఆరోగ్యానికి దోహద పడతాయన్నారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెంచారపు బుచ్చిరెడ్డి, ఆర్గనైజర్లు మల్లెల కుమార్, అనిరుధ్, గణిపాక ప్రమోద్, ప్రదీప్, జాపెత్, ఉప్పి, భాస్కర్, రాంరాజ్, నాయకులు బాల రెడ్డి, వెంకటచారి, ప్రకాష్, అరవింద్, రాజు, రవి, కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలే టార్గెట్

## గ్రామాల్లో జోరుగా బీఆర్ఎస్ మీటింగ్‌లు

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ నేతలు గ్రామాల్లో ముమ్మరంగా పర్యటిస్తున్నారు. జోరుగా క్లస్టర్ మీటింగ్‌లు నిర్వహిస్తూ స్థానిక ఎన్నికలకు కార్యకర్తలను సిద్ధం చేస్తున్నారు. మంగళవారం బచ్చనపేట క్లస్టర్ 2 ఇంచార్జిలు మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి ప్రేమలత రెడ్డి, మాజీ కౌన్సిలర్లు వాంకుడోతు అనిత, ఉల్లెంగుల నర్సింగ్, పట్టణ యూత్ అధ్యక్షుడు ఉల్లెంగుల సందీప్, రైతు సమన్వయ సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు ఈర్రి రమణారెడ్డి, వైస్ ఎంపీపీ అనిల్ రెడ్డి ఆధ్వర్యంలో మీటింగ్‌లు జరిగాయి. బచ్చనపేట మండలంలోని నారాయణపూర్ , పోచన్నపేటగ్రామాల్లో నాయకులు, కార్యకర్తలతో కలిసి మాట్లాడారు. రానున్న రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అత్యధిక స్థానాలు సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోకారు. ఇక బచ్చనపేట క్లస్టర్ 3 ఇంచార్జిలు మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు ముస్త్యాల దయాకర్, మహ్మద్ సమద్, మాజీ మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ మసిహూర్ రహమాన్, జనగామ పట్టణ కార్యదర్శి ఉద్గుల నర్సింహులు, సురేష్ గౌడ్ ఆధ్వర్యంలో బచ్చనపేట మండలం ఇటికలపల్లి, రామచంద్రపురం గ్రామాలల్లో నాయకులు, కార్యకర్తలతో సన్నహాక సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో బచ్చన్నపేట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బోడిగం చంద్రరెడ్డి, గ్రామ అధ్యక్షులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.







# కాంగ్రెస్ బచ్చన్నపేట మండల కమిటీ ప్రకటన

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** మాజీ ఎమ్మెల్యే, జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాపరెడ్డి చేతుల మీదుగా బచ్చన్నపేట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నూకల బాల్ రెడ్డి ఆధ్వర్యంలో బచ్చన్నపేట కాంగ్రెస్ పార్టీ మండల కమిటీని పూర్తిస్థాయిలో కమిటీని ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా నూకల బాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అల్వాల ఎల్లయ్య, ఉపాధ్యక్షులుగా బానే రాజేష్, చెవిటి ఆనందం, గార్లపాటి మహిపాల్ రెడ్డి, మట్టి బాలరాజు, ఆరేళ్ల భాస్కర్, నీలా రమేష్, కోశాధికారిగా మేకల ఉపేందర్ రెడ్డి, కార్యదర్శులుగా బొమ్మన రాజయ్య గౌడ్, బడెపోలు శ్రీనివాస్ రెడ్డి, చిక్కుడు కృష్ణ, పి కనకసేనారెడ్డి, దేవుని ఎల్లారెడ్డి, రాగుల యాదిరెడ్డి, జ్యోతి భాస్కర్, దాచేపల్లి రాజయ్య, తాతిరెడ్డి భాస్కర్ రెడ్డి, ముఖ్య సలహాదారుగా బండకింది హరిబాబు గౌడ్, కేమిడి అమృత రెడ్డి, మాసాపేట రవీందర్ రెడ్డి, ఎండి గౌస్, ప్రచార కార్యదర్శులుగా రంగు అశోక్ గౌడ్, జంగిలి స్వామి, సహాయక కార్యదర్శులుగా పస్తం పోచయ్య, రాపాక కనకయ్య, కందుకూరి సందీప్, లక్కర్స్ వెంకటేశ్వర్లు, తలారి బాల నరసయ్య, పంది పెల్లి నర్సిరెడ్డి, కమిటీ సభ్యులుగా పిట్టల శ్రీనివాస్, గొడుగు నర్సింహులు, ఇమ్మడి భూపాల్ రెడ్డి, పరదేసత్తయ్య, ఎండి యాకుబ్ పాషా, నర్మెట చంద్రమౌళి గౌడ్, దొంతుల సత్యనారాయణ, మునిగడప ఇంద్రయ్య, మానుపాటి కృష్ణ, సోషల్ మీడియా మండల కన్వీనర్ గా కొన్నకనకరాజును నియమించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నూకల బాల్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ నల్లనాగుల శ్వేతా వెంకన్న, యూత్ అధ్యక్షుడు ఎద్దు హరీష్, సిద్దుల గుట్ట చైర్మన్ ఆముదాల మల్లారెడ్డి, డేరెక్టర్ నిమ్మ కరుణాకర్ రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# హైస్కూల్ విద్యార్థులకు నేడు విద్యా సదస్సు

**జనగామ, మన చౌరాస్తా :** 9, 10 వ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక విద్యా సదస్సు బుధవారం ఉదయం సాయిరాం కన్వెన్షన్ హాల్లో నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రాం చీఫ్ కోఆర్డినేటర్ లయన్ వై. సంజీవరెడ్డి తెలిపారు. స్థానిక లయన్స్ క్లబ్ లు జనగామ, ఆబాద్, మిలీనియం, సూర్య, శ్రీసాయి, బీ బాయ్స్, కింగ్స్ క్లబ్ ల సంయుక్త ఆద్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సదస్సు లో ఫాకల్టీ గా విజయవాడకు చెందిన పూర్వ జిల్లా గవర్నర్, విశ్రాంత ఆచార్యులు లయన్ అన్నపరెడ్డి కోటిరెడ్డి పాల్గొని విద్యార్థులకు 'ఎయిమ్ యాక్ట్ అచీవ్' అంశంపై విశ్లేషిస్తూ ప్రసంగిస్తారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖాధికారి ఎం. రమేశ్ పాల్గొంటారు. లయన్స్ జిల్లా గవర్నర్ లయన్ కుందూరు వెంకట్ రెడ్డి ప్రారంభించే ఈ కార్యక్రమంలో గౌ. అతిథులుగా పూర్వ జిల్లా గవర్నర్లు డా. డి. లవకుమార్ రెడ్డి, లయన్ కన్న పరశురాములు పాల్గొంటున్నారు, రీజియన్ చైర్మన్ లు కలువల భాస్కర్ రెడ్డి, చందుపట్ల రవీందర్ రెడ్డి, జోన్ చైర్మన్ లు శ్రీభాష్యం రఘు, పజ్జూరి జయహరి, రంగరాజు ప్రవీణ్ కుమార్ రీజియన్ కార్యదర్శులు కన్న శ్రీనివాస్, పప్పు వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొంటారు. జనగామ పట్టణ ప్రాంతంలో గల హైస్కూల్లకు చెందిన సుమారు 1500 మంది విద్యార్థులు పాల్గొంటున్నారని అందరూ ఉదయం 10 గం ల వరకు సాయిరాం కన్వెన్షన్ హాల్ వద్దకు చేరుకోవాలని సంజీవరెడ్డి కోరారు.



# చిలుకూరు అర్చకుడిపై దాడి సరికాదు

**జనగామ, మన చౌరాస్తా :** చిలుకూరు బాలాజీ అర్చక స్వామి రంగరాజన్‌పై జరిగిన దాడిని వేద పండితులు శ్రీచెన్న కేశవస్వామి దేవాలయం అర్చక బృందం, భక్త మండలి తీవ్రంగా ఖండించారు. సోమవారం వారు ఇక్కడ మాట్లాడుతూ చిలుకూరు దేవాలయ అర్చకుడిపై చేయడం సరికాదని, దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నల్లాన్ చక్రవర్తుల మురళీధర్ ఆచార్యులు, కందాల లక్ష్మీనరసింహాచార్యులు, గుదిమెళ్ల అప్పల ఆచార్యులు, వేదాంతం రాఘవాచార్యులు, కట్టెకోల బద్రీనాథ్ పాల్గొన్నారు.

## అద్దంకి దయాకర్ కోసం
# మేడారంలో పూజలు



**ములుగు, మన చౌరాస్తా :** అద్దంకి దయాకర్‌కు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో సముచిత స్థాయి పదవి రావాలని కోరుతూ మాల మహాసభ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర రాజకీయ వ్యవహారాల ఇంచార్జ్ తాటి కుమార్ మేడారంలో పూజలు చేశారు. మంగళవారం సమ్మక్క గద్దెలను దర్శించుకున్న ఆయన తల్లులకు మొక్కలు చెల్లించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత రాష్ట్ర కాంగ్రెస్ పార్టీకి అధికార ప్రతినిధిగా, ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూ కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా, కాంగ్రెస్ గొంతుగా పనిచేస్తున్న అద్దంకి దయాకర్‌ను పార్టీ గుర్తించాలన్నారు. రాబోయే రోజుల్లో ఆయన మంచి పదవి రావాలని తల్లులను కోరుకున్నట్టు చెప్పారు.

# జనగామలో నవోదయ ఏర్పాటు చేయాలి

- **ఎంపీ కడియం కావ్య**

**జనగామ, మన చౌరాస్తా :** ఢిల్లీలో కేంద్ర పాఠశాల విద్య శాఖ సెక్రటరీ సంజయ్ కుమార్ , కేంద్ర నవోదయ విద్యాలయ సమితి కమీషనర్ ప్రాచీపాండే తో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య సమావేశం అయ్యారు. తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన జనగామ జిల్లాలో జవహర్ నవోదయ విద్యాలయాన్ని మంజూరు చేయాలని ఈ సందర్భంగా వినతి పత్రం అందజేశారు. జనగామ జిల్లాలో అత్యధికంగా షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు మరియు బలహీన వర్గాలకు చెందిన ప్రజలు ఉన్నారని, ఈ ప్రాంతం తక్కువ అక్షరాస్యత రేటును కలిగి ఉందని తెలిపారు. జవహర్ నవోదయ విద్యాలయాన్ని మంజూరు చేస్తే ఎంతో మంది నిరుపేద విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. జవహర్ నవోదయ విద్యాలయ ఏర్పాటుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ స్థలాన్ని కేటించడానికి సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. జనగామ జిల్లాలో జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటు జరిగితే విద్యార్థులు ఇక్కడకు చేరుకోవడానికి మెరుగైన రవాణా సౌకర్యం ఉందని, ఇటు నేషనల్ హైవేతో పాటు రైల్ మార్గం కూడా అందుబాటులో ఉన్నట్లుగా ఎంపీ తెలియజేసారు. ఎంపీ అభ్యర్థన పట్ల కేంద్ర పాఠశాల విద్య శాఖ సెక్రటరీ సంజయ్ కుమార్, కేంద్ర నవోదయ విద్యాలయ సమితి కమీషనర్ ప్రాచీపాండే సానుకూలంగా స్పదించినట్లు ఎంపీ తెలిపారు.



WANTED విలేకరులు కావలెను



www.manachourasta.com
మన చౌరాస్తా
The Complete News way




'మన చౌరాస్తా' తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తి స్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'మన చౌరాస్తా' సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9676400812